క్లుప్తంగా

విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మల తొలగింపు


కొమ్మలు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: 'కరెంట్ తీగలపై అల్లుకున్న నిర్లక్ష్యం' అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో మంగళవారం వచ్చిన వార్తా కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ రాంనగర్ బస్తీ ఇందిరమ్మ కాలనీలో ఉన్న పలు కరెంట్ స్తంభాల తీగలపై చెట్ల కొమ్మలు దట్టంగా అలుముకుని కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగిస్తుండటంతో విద్యుత్ సిబ్బంది వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా కొమ్మలను నరికి వేయించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ జి.రవి, లైన్‌మెన్ పి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో 16 అంశాలపై తీర్మానం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 16అంశాలపై కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, ఏఈ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

లక్సెట్టిపేట: ఈ నెల 7వ తేదీన జన్నారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల వినియోగదారులు ఉదయం 10:30గంటలకు హాజరై విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం లోకల్ కోర్టు సమావేశంలో పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశానికి పరిష్కార వేదిక చైర్మన్ ఎస్.రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, రాజగౌడ్, హాజరవుతారని విద్యుత్ సమస్యలున్న వినియోగదారులు ఈ పరిష్కార వేదికకు హాజరై పరిష్కరించుకోవాలని తెలిపారు.

ఓపెన్‌కాస్టు గనుల్లో ఉద్యోగాలు కల్పించాలి


సమస్యలు తెలుపుతున్న నాయకులు

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్టు గనుల్లో భూనిర్వాసితులకు, స్థానికులకు ఉద్యోగవకాశాలు కల్పించాలని బీజేపీ నాయకులు కోరారు. సీసీసీలోని సింగరేణి గెస్టు హౌజ్‌లో మంగళవారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్‌ను బీజేపీ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఓసీపీల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన వారిని కాకుండా స్థానికేతరులకు ఓబీ పనుల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారన్నారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నస్పూర్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, ప్రధాన కార్యదర్శి కుర్రె చక్రి, పీ. సదయ్య, నాయకులు శ్రీనివాస్, మహేందర్, కొండ వెంకటేశ్ పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మాల మహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. రాజకీయాల కోసం మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టేందుకు ఎస్సీ వర్గీకరణ చేపట్టారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రతులను చదవకుండానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్డినెన్స్ తీసుకువస్తామని ప్రకటించటం సరికాదన్నారు. ఆగస్టు 7, 8, 9తేదీలలో ఢిల్లీలో జరిగే దీక్షలకు మాలలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి పలిగిరి కనకరాజు, జిల్లా గౌరవాధ్యక్షులు బైరమల్ల మొగిలయ్య, నక్క శ్రీనివాస్, గోక శ్రీనివాస్, నల్లాల మురళి, సంకె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయశంకర్ జయంతి


మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


మంచిర్యాలక్రైం: నివాళులర్పిస్తున్న ఆర్డీవో రాములు


చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో...


దండేపల్లి: పూలమాల వేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, పార్టీ కార్యాలయాల్లో సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షుడు తిరుపతి, మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఆర్డీవో పడాల రాములు, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ మురళీకృష్ణ, మందమర్రిలో ఏరియా జీఎం మనోహర్, ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి పీఎం మైత్రేయబంధు, దండేపల్లిలో అఖిలభారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజన్న, బెల్లంపల్లిలో మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ జే.శ్వేత, సీఓఈ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.శ్రీధర్, ఆయా గనులపై జీఎంలు, సింగరేణి అధికారులు, కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


భీమారం: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...


బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న సీఓఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు


తాండూర్: నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు


చెన్నూర్ కస్తూర్బా కళాశాలలో...


రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు


మంచిర్యాలక్రైం: టీఎన్‌జీవో ఆధ్వర్యంలో...


బెల్లంపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది


జన్నారం: తహసీల్దార్ కార్యాలయంలో...


కోటపల్లి: రాంపూర్‌లో...


పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు


మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...


లక్సెట్టిపేట: నివాళులర్పిస్తున్న తహసీల్దార్ దిలీప్‌కుమార్


కాసిపేట: ఎంపీడీవో కార్యాలయంలో...

పారిశుధ్య నిర్వహణ ప్రతీ ఒక్కరి బాధ్యత

• కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: పారిశుధ్య నిర్వహణపై సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు తమ నివాస ప్రాంతాల పరిశుభ్రత బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి మంగళవారం మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని 6వార్డులో పర్యటిస్తూ పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వం సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.


వార్డులో పర్యటిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

నిర్మాణం నిలిపివేయాలని కలెక్టర్‌కు వినతి

చెన్నూర్: మున్సిపాలిటీలోని 10వ వార్డు పరిధిలో గల పోస్టాఫీసు పక్కన గల పాత యూనియన్ బ్యాంక్ భవన యజమాని నిబంధనలకు విరుద్ధంగా పునర్ నిర్మాణం పేరుతో రాకపోకలు సాగించే దారి పక్కనే కిటికీలు ఏర్పాటు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితులు జాఫర్ తెలిపారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌ను వివరణ కోరగా సయ్యద్ జాఫర్ అలీ ఫిర్యాదు చేశారు. నిర్మాణాల విషయం టౌన్ ప్లానింగ్ అధికారి చూస్తుంటారు. అక్రమంగా కిటికీలు నిర్మిస్తున్న విషయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారికి చెప్పాం. శుక్రవారం టీపీవో వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలిస్తారని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

దండేపల్లి: మండలంలోని ఊట్ల అటవీ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కలపను సోమవారం రాత్రి పట్టుకున్నట్లు దండేపల్లి డీఆర్వో పోచమల్లు తెలిపారు. గుండాల నుంచి తీసుకొస్తున్న కలపను ఊట్ల అటవీ సమీపంలో తమ సిబ్బందితో కలిసి రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నాలుగు టేకు దుంగలు పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ.7,622 ఉంటుందన్నారు. కలపను తాళ్లపేట రేంజ్‌కి తరలించినట్లు పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పలు గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన ఐదు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం క్వాలిటీ కంట్రోల్ ఏడీఈ జి.మనోహర్ రెడ్డి, మంచిర్యాల ఏడీఈ నూక రాజశేఖర్ పర్యవేక్షించారు. రైతులతో మాట్లాడుతూ.. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ అంతరాయం జరిగినప్పుడు విద్యుత్ సిబ్బందితో మాత్రమే సరి చేయించుకోవాలని సూచించారు.

ఆదివాసీ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

కోటపల్లి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కరపత్రాలను డీటీడీవో గంగారం మంగళవారం ఆవిష్కరించారు. చెన్నూర్‌లో ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆదివాసీ సంఘం నాయకులు తెలిపారు. ఆదివాసీల సంఘం నాయకులు, పెద్దలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేక శేఖర్, మాంతయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

'ఆదివాసీల గోడు' విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 08న నిర్వహించే 'ఆదివాసీల గోడు' సెమినార్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు భాగాల రాజన్న, ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఆర్టీసీ పెట్రోల్ బంక్‌లో మోసం

చెన్నూర్: ఆర్టీసీ ప్రాంగణంలో గల పెట్రోల్ బంక్‌లో యాజమాన్యం మోసానికి పాల్పడుతుందని కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పెట్రోల్ బంక్‌లో వాహనదారుడు లీటర్ పెట్రోల్ కొనుగోలు చేస్తే 100ఎంఎల్ తక్కువగా వస్తుందన్నారు. వారం రోజుల నుంచి వాహనదారులు ఆరోపిస్తున్నా, ఆ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. మంగళవారం కొందరు వాహనదారులు వాహనంలో పెట్రోల్ వేసుకుంటే తక్కువగా రావడంతో సోషల్ మీడియాలో పోస్టులు చేశారని గుర్తు చేశారు. అధికారులు స్పందించి పెట్రోల్ బంక్ యాజమానులు చేస్తున్న మోసాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

'దళిత వర్గాలకు అండగా ఉంటాం'

కోటపల్లి: దళిత, అణగారిన వర్గాల ప్రజలకు అండగా ఉంటామని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య అన్నారు. కోటపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు.

గద్దర్‌కు నివాళి


పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల/మందమర్రిరూరల్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని జిల్లా కేంద్రం, మందమర్రి పట్టణాల్లో కళాకారులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారులు రాకం సంతోష్, ప్రభాకర్, రాజయ్య, పోశం, సుదర్శన్, రాజేశ్వరరావు, సంపత్, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీల కంఠేశ్వర్‌రావు, తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు దేవి సత్యం తదితరులు పాల్గొన్నారు.

కుంకుమ పూజలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ తల్లి చౌక్ రోడ్ నంబర్-1లో శివపంచాయితన ఆలయంలో మంగళవారం కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అన్నప్రసాదం జరిపారు. కార్యక్రమంలో లలితా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

నెన్నెల: నెన్నెల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ పరిధిలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కస్తూర్బా పాఠశాల, చిత్తాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని ఓబీసీ మోర్చా పట్టణాధ్యక్షుడు పొంచాల రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, డ్రెయినేజీలు శుభ్రంగా లేవని, కోతులు విపరీతంగా దాడులు నిర్వహిస్తున్నాయని వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జిల్లాను అగ్రగామిగా నిలపాలి

దండేపల్లి: ఈ ఏడాది నవంబర్‌లో జరిగే జాతీయ సాధన సర్వే(న్యాస్)లో మంచిర్యాల జిల్లాను అగ్రగామిగా నిలిచేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని దండేపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్‌గౌడ్ సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొట్టె రాజన్నను సన్మానించారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం'

నస్పూర్/శ్రీరాంపూర్/బెల్లంపల్లిరూరల్/చెన్నూర్/చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లి/జన్నారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం మంగళవారం రెండోరోజు కొనసాగింది. పలుచోట్ల తాగు నీటి వసతుల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, మిషన్ భగీరథ ట్యాంక్‌లు, నీటి సరఫరాల పంపుల వద్ద క్లోరినేషన్ పనులు చేపట్టారు. మొక్కలు పంపిణీ చేశారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ వంతు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని పలువురు వక్తలు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రజలకు వివరించారు. జన్నారంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో శశికళ చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యాలయ సిబ్బంది పిచ్చి మొక్కలు తొలగించారు. ఆయా కార్యక్రమాల్లో నస్పూర్‌లో మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణు, కమిషనర్ సీహెచ్ సతీష్, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, చెన్నూర్‌లో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, బెల్లంపల్లిలో మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నస్పూర్: మొక్కలు నాటుతున్న చైర్మన్, కమిషనర్

బండలపై నడిచి.. బడి పరిశీలించి

మంచిర్యాలఅగ్రికల్చర్: పారిశుధ్య కార్యక్రమాల పరిశీలనలో భాగంగా మంగళవారం కలెక్టర్ కుమార్‌దీపక్ జిల్లా కేంద్రంలోని 6వ వార్డులో పర్యటిస్తూ, ఆకస్మికంగా గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ క్రమంలో కలెక్టర్‌కూ బురద నుంచి తిప్పలు తప్పలే. బడిచుట్టూ తిరగాలంటే బండలపై నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. తరగతి గదులు, పరిసరాలు, రిజిస్టర్లు, రికార్డులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు పరిశీలించారు. పాఠశాల ఆవరణలో శుభ్రత, మరమ్మతు, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.



'చెడు అలవాట్లకు బానిస కావొద్దు'

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం సీఐ కుమారస్వామి, ఎస్సై గంగారాం డ్రగ్స్, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రహరీ క్లబ్ ఏర్పాటు చేశారు.

తాండూర్: చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని అచ్చలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం గంజాయి, మాదక ద్రవ్యాల వాడకం, వాటి వల్ల కలిగే నష్టాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు.

వేమనపల్లి: పాఠశాల ప్రహరీ క్లబ్(యాంటీ డ్రగ్స్ అవేర్నెస్)తో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపనున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ప్రహరీ క్లబ్‌ను ఎన్నుకున్నారు.

'ఎంపీ చొరవతో సమస్య పరిష్కారం'

తాండూర్: ఎంపీ వంశీకృష్ణ చొరవతోనే ఎన్నో రోజులుగా నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారమైందని మాజీ ఎంపీటీసీ శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా అన్నారు. నూతనంగా రైల్వే అండర్ పాస్ నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌ను పరిశీలించారు.